క్లుప్తంగా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మేనల్లుడి మృతి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో జీవన్‌రెడ్డి (ఫైల్)

సైదాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మేనల్లుడు జీవన్‌రెడ్డి(47) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలో నివసించే కిషన్‌రెడ్డి సోదరి లక్ష్మమ్మ, నర్సింహారెడ్డి దంపతుల కుమారుడు జీవన్‌రెడ్డి విద్యా సంస్థలు నడుపుతున్నారు. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటిలో ఉన్న ఆయన హఠాత్తుగా గుండెపోటుకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆయనను సంతోష్‌నగర్‌లోని డీఆర్‌డీఎల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య ఉమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

పార్కుల సుందరీకరణకు కృషి

ఎల్‌బీనగర్: పార్కుల్లో మెరుగైన వసతులు కల్పించి.. అన్నివిధాలా అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్‌–2 కిష్కింద పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శకులు సేదదీరేందుకు తగు వసతులు, రాత్రి సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తథ్యం

మలక్‌పేట: రాబోయే ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎస్సీ మోర్చా నేషనల్ మీడియా ఇన్‌చార్జి, భాగ్యనగర్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.కుమార్ అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి టెంపుల్ లైన్‌లో గురువారం జరిగిన కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలు, పార్టీ విధానాలు ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ విధానాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి గౌర దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు కొప్పుల దినేష్‌కుమార్, జక్కా మోహన్‌రెడ్డి, ఉదయ్, చరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన గట్ల రమేష్

నాగోలు: ఫ్యామిలీ ఫంక్షన్‌కు వచ్చిన జ్ఞాపక శక్తి సరిగా లేని ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వనస్థలిపురంలో నివాసం ఉండే గట్ల రమేష్(57) ఈ నెల 22న ఎల్‌బీనగర్ శివపురికాలనీలో జరిగే ఫ్యామిలీ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు వచ్చాడు. ఫంక్షన్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెతికినా కనిపించక పోవడంతో గురువారం ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తికి కొంత కాలంగా జ్ఞాపకశక్తి తగ్గిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసినవారు ఎల్‌బీనగర్ పోలీసులను ఫోన్: 94910 39120లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఎన్టీఆర్‌నగర్‌వాసులకు పట్టాలు ఇవ్వరా?

దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్‌నగర్ ప్రజలకు పట్టాలు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ మాట తప్పారని బీజేపీ మహేశ్వరం అసెంబ్లీ ఇంచార్జి అందెలా శ్రీరాములు యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ధీరజ్ రెడ్డి అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేస్‌–1 కాలనీలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ యువత నిరుద్యోగులు గానే మిగిలిపోయిందని, దళితులకు 3 ఎకరాలు ఇవ్వలేదని, కేజీ నుంచి పీజీ ఉచిత విద్య హామీగానే మిగిలిపోయాయన్నారు. కేసీఆర్ నిరంకుశ, అవినీతి, కుటుంబ పాలన చేస్తోన్న బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కుసుమ, నేతలు రమేష్ పాల్గొన్నారు.

మూసీ.. పచ్చందాలతో మురిసి!

- పచ్చని చెట్లతో ఆహ్లాదాన్ని నింపుతున్న మూసీ పరీవాహక ప్రాంతం
- పూల వాసనలతో గుభాలిస్తున్న వాకింగ్ ట్రాక్
- సందర్శకుల హృదయాలను హత్తుకునేలా ఏర్పాట్లు


మూసీ నది వెంబడి ఏర్పాటు చేసిన మొక్కలు



నాగోలు: నాగోలు బ్రిడ్జి మొదలుకుని సత్యానగర్ వరకు మూసీ నదికి ఇరువైపులా వాకింగ్ ట్రాక్, పచ్చిక బయళ్లు, గార్డెనింగ్, అందమైన పూలమొక్కలతో ఆహ్లాదరంగా అందంగా తీర్చిదిద్దారు. మూసీకి ఇరువైపూలా వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులో రావడంతోపాటు అందమైన మొక్కలు, గార్డెనింగ్‌ను ఏర్పాటు చేశారు. మూసీ నదికి పూర్వ వైభవం తిరిగి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలతో మూసీ సుందరంగా తీర్చిదిద్దడంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, ఎంఆర్‌డీసీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు చెపట్టారు. ఈ నేపథ్యంలో మూసీ అన్ని హంగులతో రూపదిద్దుకుని ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తోంది.

- ◆ వాకింగ్‌తో పాటు ఆహ్లాదం కోసం ప్రజలు పెద్ద ఎత్తున మూసీ తీరానికి వస్తున్నారు. ఒక్కప్పుడు కంపు ఉన్న ప్రాంతంలోనే ప్రస్తుతం గులాబీలు, మల్లెపూల మొక్కలు, కాగితపు పూల చెట్లు ఇతర పూల వాసనలతో గుభాలిస్తున్నది.
- ◆ మూసీ రివర్ బ్యూటిఫికేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చుచేస్తున్నారు. ఎలాంటి దుర్వాసన లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సినీపరిశ్రమ వారి అభిరుచులకు అనుగుణంగా.. వారు సినిమా షూటింగులు చేసుకోవడానికి అద్భుతమైన లోకేషన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.
- ◆ మూసీ నది సమీపంలో ఓపెన్ జిమ్స్, చిల్డ్రన్ పార్క్స్, సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. మూసీ నది ఒడ్డున అద్భుతమైన ల్యాండ్ స్కెపింగ్‌లు ఏర్పాటు చేశారు. రోజూ మూసీ చుట్టూ దోమల నివారణ మందుకు పిచికారీ చేయిస్తున్నారు.
- ◆ మూసీనది స్వరూపం మార్చి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మూసీ వెంబడి గతంలో ఏర్పాటు చేసిన చెట్లు పెద్ద సంఖ్యలో పెరగడంతో అక్కడి వెళ్లగానే పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణం కనువిందు చేస్తుంది. దీంతో కొత్తపేట, మోహన్‌నగర్, సత్యానగర్, న్యూ నాగోలు, నాగోలు, బండ్లగూడ, ఉప్పల్ తదితర ప్రాంతాల నుంచి ఉభయ సంధ్య వేళల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో మూసీ నది వద్ద చేరుకొని సేదతీరుతున్నారు. ఆహ్లాదాన్ని ఎంజాయ్ చేస్తూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారు.

> ఒకప్పుడు మూసీ తీరానికి ముక్కు మూసుకుని రావాల్సి వచ్చేది. ప్రస్తుతం మూసీ నదికి పరసర ప్రాంతాలు అన్ని హంగులతో రూపుదిద్దుకుని ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. మూసీ తీరం వెంబడి పరిసరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వివిధ రకాల పూలతో నేత్రపర్వంగా ఉంటూనే.. సువాసనలు వెదజల్లుతున్నాయి.




మూసీ నది వద్ద ఏర్పాటు విరబూసిన మల్లెపూలు

అప్పుల ఊబిలో తెలంగాణ: నల్లు


మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి

హయత్‌నగర్: ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ఆర్థికంగా పటిష్టం చేస్తే కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఆ పథకాలను సేదలకు నేరుగా అందించకుండా పేర్లను మార్చి తన పథకాలుగా కేసీఆర్ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇవ్వడంలో, పెన్షన్‌లు, రేషన్ కార్డులను ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ... ఎంతో మంది విద్యార్థులు, ఉద్యమ కారుల త్యాగఫలితంతో తెలంగాణ సాధ్యమైందని, తెలంగాణ సాధిస్తే ఉద్యోగాలు వస్తాయని త్యాగాలు చేస్తే కేవలం కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ప్రయోజనం జరిగిందని అన్నారు. నయా నిజాం నిరంకుశ పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, నాయకులు చెన్నగోని రమేష్, నక్క వెంకటేష్, గుండ్లపల్లి రమేష్, పారంద మహేష్, బొంగు రఘు, అప్పారావ, పార్వతి, సంఘి అశోక్, గోవిందాచారి, గంగని రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎం పెంపుడు కుక్కకున్న విలువ పేదల ప్రాణాలకు లేదా?

కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి


ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చైతన్యపురి: ముఖ్యమంత్రి పెంపుడు కుక్క చనిపోతే ఇద్దరు అధికారులను సస్పెండు చేశారని, అయితే అంబర్‌పేటలో కుక్కల దాడిలో ఓ పేద బాలుడు చనిపోతే ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పేదల ప్రాణాలకు విలువ లేదని, ఒక పేదవాడి ప్రాణం ముఖ్యమంత్రి పెంపుడు కుక్క కంటే హీనమా అని ఆయన ప్రశ్నించారు. గురువారం మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలసి వీధి కుక్కలను కట్టడి చేసి ప్రజలను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడుతూ... మేయర్ గద్వాల విజయలక్ష్మి కుక్కలకు మాంసం దొరక్క పిల్లలపై దాడి చేస్తున్నాయని వ్యాఖ్యానించడం శోచనీయమని, ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ మేయర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మేయర్ వ్యాఖ్యలపై పురపాలక శాఖా మంత్రి కేటీఆర్ స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. అంబర్‌పేట ఘటన మరువక ముందే చైతన్యపురి డివిజన్‌లో మరో పేదింటి బిడ్డపై కుక్కలు దాడి చేశాయని, జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు సుధీర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, కట్ల నర్సింహాయాదవ్, లింగాల కిశోర్‌గౌడ్, వేణు యాదవ్, రమేష్ నాయక్, జైపాల్‌రెడ్డి, శ్యాంచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేలకు అమ్మేశాడు

బాలుడి కిడ్నాప్ కేసు ఛేదించిన సైదాబాద్ పోలీసులు


బాలుడిని తల్లి చెంతకు చేర్చిన సైదాబాద్ పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్

సైదాబాద్: భిక్షాటన చేసుకునే యువతికి మద్యం తాగించి ఆమె కుమారుడిని కిడ్నాప్ చేసిన కేసును సైదాబాద్ పోలీసులు ఛేదించారు. గురువారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ సి.హెచ్.రూపేష్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా, కేశంపేట్ మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన పార్ధ లక్ష్మి సైదాబాద్‌లో భిక్షాటన చేస్తుంటుంది. ఈనెల 18న ఆమె శంకేశ్వరబజార్‌లోని శివాలయం వద్ద కుమారుడు రాంచరణ్ (5)తో కలిసి భిక్షాటన చేస్తుంది. అక్కడే భిక్షాటన చేస్తున్న పండు ఆమెను పరిచయం చేసుకున్నాడు. మద్యం ఇప్పిస్తానని చంపాపేట్‌లోని వైన్‌షాప్‌నకు తీసుకెళ్లాడు. ఆమె మద్యం తాగుతుండగా ఇప్పుడే వస్తానంటూ ఆమె కుమారుడిని తీసుకుని వెళ్లిపోయాడు. అతను తిరిగి రాకపోవటంతో కుమారుడి కోసం గాలించిన లక్ష్మి ఈనెల 20న సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలుడు కిడ్నాపైనట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితుడు పండు బాలుడిని హస్తినాపురం తీసుకెళ్లి అక్కడే రెండు రోజులు ఉన్నాడు. ఆ తర్వాత నల్గొండకు తీసుకెళ్లి నరసింహ అనే వ్యక్తికి రూ.10 వేలకు విక్రయించాడు. నరసింహకు ముగ్గురు కుమార్తెలే కావడంతో మగపిల్లవాడి కోసం రాంచరణ్‌ను కొన్నట్లు డీసీపీ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసును ఛేదించామని, ఈ విషయంలో పోలీసులకు సహకరించిన స్థానిక యువకులు రవితేజ, కిషోర్, జస్పాల్ సింగ్ లకు డీసీపీ అభినందనలు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి, డీఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

దళిత బంధుతో దళారులకే లాభం

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లో ఎంఐఎం పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. బుధవారం రాత్రి డివిజన్‌లోని భరత్‌నగర్‌లో జరిగిన బీజేపీ ప్రజా గోస కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితులకు సీఎం కేసీఆర్ ఇస్తున్న దళిత బంధు ద్వారా దళారులే ఎక్కువ లాభపడుతున్నారన్నారు. దళిత బంధు కోసం దళారులను ఆశ్రయించవద్దన్నారు. డివిజన్‌లో ఎంఐఎం కార్పొరేటర్ ఒక్కసారి కూడా పర్యటించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి, జిల్లా, డివిజన్ నాయకులు వీరేందర్‌బాబుయాదవ్, తంగెళ్ల సుధీర్, చంద్రశేఖర్, నాగరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దిగుమతిదారులకు టీడీఎస్ మినహాయించాలి

చాదర్‌ఘాట్: ఏఎంసీ మిషన్ దిగుమతిదారులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెక్షన్ 194 క్యూ కింద టీడీఎస్‌ను మినహాయించాలని తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, ఉపాధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, వంజరి వినోద్ కుమార్, సలహాదారుడు కట్టా మల్లేశం పేర్కొన్నారు. ఈ డిమాండ్‌తో వారు వ్యాపారులతో కలిసి గురువారం మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులకు సేవలందిస్తున్న తమకు టీడీఎస్ మినహాయించాలని ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ చైర్మన్ నితిన్‌గుప్తాలకు లేఖలు రాశామన్నారు. ట్విట్టర్ ద్వారా కూడా వారి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆందోళన చేస్తున్న ఏఎంసీ కమిషన్‌దారులకు మద్దతుగా ఆందోళన చేశామన్నారు. మార్కెట్‌లో గంట సేపు క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. వ్యాపారులు దుగ్గ జగదీష్, విజయ్, అనిల్, వెంకటేష్, మైల రవి కాంత్, శంకర్‌రావు పాల్గొన్నారు.

పైప్‌లైన్ విస్తరణతో తాగునీటి సమస్యకు చెక్: వంగా


నేతాజీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: నేతాజీనగర్ కాలనీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసినందున లోప్రెషర్, కలుసిత నీటి సరఫరా సమస్యలకు చెక్ పెట్టవచ్చని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కాలనీలో పర్యటించి తాగునీటి పైప్‌లైన్ లీకేజీ, విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, రహదారులపై ప్రవహిస్తున్న మురుగు, అసంపూర్తిగా ఉన్న కాలనీ సంక్షేమ సంఘ భవనం తదితరాలను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... గత ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే కాలనీవాసులు సమస్యలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. త్వరలో ప్రత్యేక నిధులతో కాలనీలో తాగునీటి పైప్‌లైన్, భూగర్భ డ్రైనేజీ విస్తరణతో పాటు కాలనీ సంక్షేమ సంఘ భవనం నిర్మాణ పనులు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీ నేతలు బైగళ్ల రవీందర్, మంత్రి జగన్, నరసింహ, దొబ్బ రాజు, సురేందర్, సాయి, కార్తీక్, నాయకులు అంజి, రామాంజనేయులు, పాశం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

లింగోజిగూడ: తెలంగాణలో కొనసాగుతున్న సీఎం కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాల్సిన అవసరం ఆసన్నమైందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పెట్రోలియం శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. గురువారం చంపాపేటలో హైదరాబాద్ భాగ్యనగర్ జిల్లా పార్లమెంట్ శక్తి కేంద్రం ఇంచార్జిల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... అవినీతి, కుటుంబ పాలనను కొనసాగిస్తున్న కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో తగ్గిన గుణపాఠం చెప్పాలని కోరారు. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో మరో సారి బీజేపీ అధికారంలో రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాని పిలుపునిచ్చారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, పార్లమెంట్‌లో శక్తి కేంద్ర ఇంచార్జిలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

హస్తినాపురం: అనుపమానగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. అంగరంగ వైభవంగా నిర్వహించిన ఉత్సవమూర్తుల ఊరేగింపులో ఆలయ కమిటీ చైర్మన్ కుడుముల వెంకట్‌రెడ్డి, స్వర్ణలత దంపతులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఉదయం 108 కలశాలతో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి అభిషేకం, మహాసుదర్శన సహిత లక్ష్మీనారాయణ మూలమంత్ర సహితనారాయణ, మహాపూర్ణాహుతి, వేద ఆశీర్వచనం, పండిత సత్కారమండప పూజలతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో భద్రావతి, నాగమణి, శ్రీనివాస్‌రెడ్డి, డి.చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీంద్రకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాలతో ఊరేగింపులో పాల్గొన్న చైర్మన్ వెంకట్‌రెడ్డి దంపతులు

మన్సూరాబాద్‌లో రూ. 120 కోట్లతో అభివృద్ధి

కార్పొరేటర్ నర్సింహారెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం: బీఆర్‌ఎస్


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు మల్లారెడ్డి, నాగరాజు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ... ప్రజా సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తుంటే అభివృద్ధికి నిధులు తానే మంజూరు చేయించానని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి చెప్పుకోవటం హాస్యాస్పదమని బీఆర్‌ఎస్ పార్టీ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు విమర్శించారు. మన్సూరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్నింగ్ వాక్ చేపట్టి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు అధికారులపై ఒత్తిడి పెంచి నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు. 2018లో ఎమ్మెల్యే అయినప్పటి నుంచి మన్సూరాబాద్ డివిజన్‌లో సుమారు రూ. 120 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. రూ. 8.38 కోట్లతో భూగర్భ డ్రైనేజీలు, రూ. 1.50 కోట్లతో ఓపెన్ స్థలాలకు ప్రహరీల నిర్మాణం, రూ. 38.90 కోట్లతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, రూ. 25.50 కోట్లతో బాక్స్‌టైప్ నాలాలు, రూ. 2.20 కోట్లతో శ్మశానవాటికల్లో మౌలిక వసతులు, రూ. 6.50 కోట్లతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, రూ. 6 కోట్లతో సీఆర్‌ఎంపీ రోడ్ల నిర్మాణం రూ. 2.70 కోట్లతో ఆక్సిజన్ పార్కు, మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ తాగు నీరు అందించామని వివరించారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ తన ఉనికిని కాపాడుకోవటానికే ఇలాంటి ప్రకటనలు చేసి ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నారన్నారు. రూ. 46 కోట్ల నిధులు మంజూరు చేయించే సత్తా కార్పొరేటర్‌కు లేదని మండిపడ్డారు. నాయకులు సురేష్, సిద్దగొని జగదీష్‌గౌడ్, రాజిరెడ్డి, నర్రి లింగం, సాయిగౌడ్, ఇరిగి రమేష్, బత్తుల దుర్గారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

- హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్
- ఘనంగా 'స్వచ్ఛ బాబా' సంత్ గాడ్గే జయంతి


మాట్లాడుతున్న డీసీ మారుతీ దివాకర్, చిత్రంలో సీఎంహెచ్‌ఓ పద్మజ తదితరులు

వనస్థలిపురం: ప్రజల ఆరోగ్య సంరక్షణలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సేవలు ఎనలేనివని, ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి పారిశుద్ధ్య పనులు నిర్వహించారని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ కొనియాడారు. గ్రామ్ స్వచ్ఛత అభియాన్ కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ, జాగృతి అభ్యుదయ సంఘం సంయుక్తాధ్వర్యంలో 'స్వచ్ఛ బాబా' సంత్ గాడ్గే బాబా జయంతిని పురస్కరించుకుని గురువారం వనస్థలిపురం శారదానగర్‌లో పరిశుభ్రత-ఆరోగ్య పరిరక్షణ-వ్యక్తిగత బాధ్యత అంశంపై డాక్యుమెంటరీ ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ గాడ్గే బాబా జీవితంపై సినీ దర్శకులు (లక్ష్మణ రేఖ ఫేం) నెట్టెల గోపాలకృష్ణ దర్శకత్వంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీ మాట్లాడుతూ... మహారాష్ట్రలో జన్మించిన సంత్ గాడ్గే బాబా స్వచ్ఛ భారత్‌కు స్ఫూర్తిప్రదాత అని అన్నారు. గాడ్గే బాబా సన్యాసిగా మారి భిక్షాటన చేస్తూ గ్రామాలలో చీపురు దండులను ఏర్పాటు చేసి స్వచ్ఛ భారత్‌కు మార్గదర్శకులయ్యారని ఆయన గుర్తు చేశారు. ఆయన భిక్షాటనకు గాడ్గే (మూకుడు) వాడేవారని, అందుకే గాడ్గే బాబాగా పేరు వచ్చిందన్నారు. గాడ్గే బాబా, మెహర్‌బాబాలు కలసి కుష్ఠురోగులకు సేవలు అందించేవారని, తమ భక్తులు ఇచ్చిన విరాళాలతో పేద పిల్లల కోసం విద్యాలయాలు ఏర్పాటు చేశారని అన్నారు. సీఎంహెచ్‌ఓ పద్మజ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాలుష్యం కాకుండా చూసుకుంటూ పుడమిని కాపాడు కోవాలని సూచించారు. కాలుష్యం వల్ల కేన్సర్, థైరాయిడ్, గుండె జబ్బులు తదితర రుగ్మతలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ రక్షణపై పాట పాడి అందరిని అలరించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్యుమెంటరీ నిర్మాత తిరుమల వెంకటస్వామి, గాడ్గే బాబా పాత్రధారి మదన్‌గుప్తా, నాగేశ్వర్‌రావు, కె.ఎల్.నర్సింహారావు, సి.హెచ్.వి.ఆర్.కె.మూర్తి, గోపాలదాస్ రాము, శ్రీరంగనాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అజీముద్దీన్, జవాన్లు, ఎస్‌ఎఫ్‌ఏలు, కార్మికులు పాల్గొన్నారు.


హాజరైన పారిశుద్ధ్య కార్మికులు